క్లుప్తంగా

ఘనంగా ధ్వజారోహణం



శేషవాహనంపై శ్రీలక్ష్మీనరసింహస్వామి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజారోహణం, శేషవాహన సేవను వైభవంగా నిర్వహించారు. వేదపండితులు ధ్వజస్తంభానికి గరుడపక్షి వస్త్రాన్ని ఆరోహణం చేశారు. కొడిముద్దలను పంచి పెట్టారు. ప్రత్యేక హోమం నిర్వహించారు. రాత్రికి స్వామి వారిని శేషవాహనంపై ఉంచి పల్లకిలో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. బాణసంచా పేలుస్తూ మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవ ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఉభయకర్తలుగా అంకినపల్లి ఓబుల్‌రెడ్డి దంపతులు చేజర్ల చలమారెడ్డి దంపతులు వ్యవహరించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి పర్యవేక్షించారు. గురువారం నృసింహజయంతి (హనుమంతుసేవ) నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశామన్నారు.

శతాబ్దాల సమస్యలకు శాశ్వత పరిష్కారం

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



తిక్కవరంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): రైతులు, పేదలు, సామాన్యులు ఎదుర్కొంటున్న శతాబ్దాల సమస్యలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం తిక్కవరంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానికులు, ప్రజాప్రతినిధులు గజమాలలతో, తప్పెట్లు, బాణసంచాతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రతి గడపలోనూ ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేసి పథకాలు అన్ని అందాయా లేదా అని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పలువురు మహిళలు తరతరాలుగా తాము ఎదుర్కొంటున్న ఫ్లోరైడ్ నీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఓ దివ్యాంగుడు తనకు ప్రభుత్వం ద్వారా మంజూరు చేస్తున్న పింఛన్ సరిపోవడం లేదని ఇతరత్రా సాయం చేయాలని కోరగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చుక్కల భూముల సమస్యపై పలువురు మహిళా రైతులు ఎమ్మెల్యే దృష్టికి తేగా రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారని సాదాబైనామా కోసం ప్రత్యేక జీఓ విడుదల చేసి రెవెన్యూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించను న్నారని తెలిపారు. సోమశిల హైలెవల్ కెనాల్ ద్వారా తమ గ్రామానికి నీటి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేయగా నిర్దీత వ్యవధిలో ఆయా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి గ్రామంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కిందని రానున్న కాలంలో అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, అగ్రికల్చర్, వెటర్నరీ, హార్టికల్చర్, తదితర శాఖలకు సంబంధిత మండల స్థాయి అధికారులు ఎవరు గడప గడపకు మన ప్రభుత్వం హాజరు కాకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి కార్యక్రమంలోగా వారి నుంచి సంజాయిషీతో కూడిన నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేకపాటి అభినవ్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ రమాదేవి, భీమవరం సొసైటీ అధ్యక్షుడు సోమల మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రా నారాయణస్వామి, గంగినేని బాబునాయుడు, ముటుకుందు లక్ష్మీరెడ్డి, కొమ్మూరు ప్రతాప్‌రెడ్డి, చెవుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

రీ సర్వే డేటా ఎంట్రీ ప్రాసెసింగ్ పరిశీలన

చేజర్ల: మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వే డేటా ఎంట్రీ ప్రాసెసింగ్‌ను ట్రెయినీ కలెక్టర్ ఏ మహేష్ పరిశీలించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గాలిపాళెంలో జరుగుతున్న భూముల సర్వేను పరిశీలించారు.

సమన్వయం, సహకారం అవసరం

• జెడ్పీ సీఈఓ చిరంజీవి



పంచాయతీ కార్యాలయంలో విచారణ చేస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

వింజమూరు(ఉదయగిరి): పంచాయతీ పాలన సక్రమంగా జరగాలంటే సర్పంచ్‌లు, కార్యదర్శుల మధ్య సమన్వయం, సహకారం ఉండాలని జెడ్పీ సీఈఓ చిరంజీవి తెలిపారు. వింజమూరు సర్పంచ్ నల్లగొండ్ల సుజన స్పందనలో జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాల మేరకు బుధవారం ఆయన వింజమూరు పంచాయతీ కార్యాలయంలో విచారణ జరిపారు. ముందుగా ఆయన సర్పంచ్ సుజన, కార్యదర్శి శీనయ్యతో మాట్లాడారు. పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్, కార్యదర్శుల మధ్య సత్సంబంధాలు లేకుంటే పంచాయతీ పాలన కుంటుపడుతుందని, అభివృద్ధి జరగదన్నారు. ఏదైనా రికార్డులు తనిఖీ చేసే హక్కు సర్పంచ్‌కు ఉందని, సందేహం వస్తే వెంటనే కార్యాలయంలో తనిఖీలు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం రికార్డులు తనిఖీ చేశామని, మరికొన్ని రికార్డులు తనిఖీ చేయాల్సి ఉందన్నారు. తప్పు జరిగితే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ధ్యాన తరగతులు ప్రారంభం

ఆత్మకూరు: వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా పట్టణంలోని షిరిడీ సాయి పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు వేసవి ధ్యాన తరగతులను బుధవారం రాత్రి ప్రారంభించారు. నెల రోజుల పాటు నిత్యం విద్యార్థులకు ధ్యాన తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణతో కూడిన ఉజ్వల భవిష్యత్‌ను ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

నేడు ఆలయ భూములకు కౌలు వేలం

కలిగిరి: వెలగపాడులోని పార్వతి నాగమల్లేశ్వరస్వామి ఆలయ భూములకు స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రామకృష్ణ బుధవారం తెలిపారు. ఆలయానికి చెందిన 105.33 ఎకరాల భూములను సంవత్సర కాలానికి కౌలుకు రైతులు వేలంలో దక్కించుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు వేలం కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

జగనన్న లబ్ధిదారుల వివరాల సేకరణ

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం సోమశిలలోని జగనన్న కాలనీలో ఉన్న లబ్ధిదారుల వివరాలు బుధవారం సేకరించారు. 150 మందికి పైగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. సోమశిల సచివాలయంలో ఐసీఐసీ ఏజెన్సీ అధికారి బాలయ్య మాట్లాడుతూ జగనన్న కాలనీ ఇల్లు కట్టుకోలేని వారికి స్వయంగా కట్టించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వంతో ఐసీఐసీ ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. గృహ నిర్మాణశాఖ పర్యవేక్షణలో కాంట్రాక్టర్లు జగనన్న ఇల్లు కట్టిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆనంద్ పాల్గొన్నారు.

ఉపాధి ఆడిట్ బృందం విచారణ

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలంలోని 25 పంచాయతీల్లో 2022–23 బడ్జెట్ ఏడాదిలో జరిగిన జాతీయ ఉపాధి హామీ పనులపై ఉపాధి ఆడిట్ బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా అనంతసాగరం ఉపాధి హామీ అధికారుల వద్ద వివరాలు సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ బృందం ఎస్ఆర్‌పీ (స్టేట్ రీసోర్స్ పర్సన్) వెంకయ్య, ఉపాధి హామీ ఏపీఓ దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులు ఈకేవైసీ చేయించుకోవాలి

ఉదయగిరి: ఉదయగిరి సబ్ ట్రెజరీ పరిధిలోని పెన్షన్‌దారులంతా ఈ నెల 9వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని ఎస్టీఓ సీహెచ్ మమత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్‌దారులు తమ ఆధార్‌కార్డు, మొబైల్ నంబరుతో సబ్ ట్రెజరీ కార్యాలయం లేదా నెట్ సెంటర్లలో ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు.

లోకోస్ యాప్‌పై వెలుగు సిబ్బందికి శిక్షణ

ఆత్మకూరు: ప్రభుత్వం నూతనంగా రూపొందించిన లోకోస్ యాప్‌పై వైఎస్సార్ క్రాంతి పథం, వెలుగు సిబ్బందికి రెండో రోజు శిక్షణా కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. వెలుగు కార్యాలయంలో ఏపీ వెంకటేశ్వర్లు నేతృత్వంలో నెల్లూరు డీఆర్‌డీఏ శిక్షకులు లోకోస్ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొదుపు సంఘాల పూర్తి వివరాలు ఈ యాప్‌లో పొందు పరచడం కోసం ఏపీఎంలకు, సీసీలకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. నిర్దేశించిన సమయం లోపల ఆయా మండలాల్లోని పొదుపు సంఘాల వివరాలను సిబ్బంది యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం బి.వెంకమ్మ, అన్ని గ్రామాల సీసీలు పాల్గొన్నారు.

చోర్.. చోర్

• కావలిని కలవరపెడుతున్న దొంగతనాలు
• బృందావనం చోరీ కొలిక్కిరాక ముందే వరుస చోరీలు
• పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు



కావలిలో దుకాణంలో మంగళవారం వేకువన చోరీకి పాల్పడుతున్న దొంగ సీసీ కెమెరా దృశ్యం

కావలి: పట్టణంలో వరుస దొంగతనాలు కలవరం సృష్టిస్తున్నాయి. అత్యంత భద్రత ఉండే ప్రాంతాలు, పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉండే ప్రాంతాల్లోనే దొంగలు పంజా విసురుతూ పోలీసులకే చాలెంజ్ విసురుతున్నారు. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డుల పహారాలో ఉండే బృందావనం కాలనీలో గత నెల 16వ తేదీన జరిగిన భారీ చోరీ ఘటన ఒక కొలిక్కి రాకముందే తాజాగా మంగళవారం వేకువన ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో వరుసగా మూడు దుకాణాల్లో దొంగలు పంజా విసిరారు. ఒక దుకాణం తాళాలు తెరుచుకోకపోవడంతో రెండు దుకాణాల్లో అందిన కాడికి చోరీ చేశారు. తొలుత ట్రంక్‌రోడ్‌లోని పాదర్తి యోగానంద్ చిల్లర అంగడిలో దొంగలు ప్రవేశించి రూ.10 వేల నగదు చోరీ చేశారు. అనంతరం పాలువాది మురళికి సంబంధించిన పేపర్ ప్లేట్స్ అండ్ గ్లాసెస్ స్టోర్‌లో ప్రవేశించి రూ. 20 వేలు చోరీ చేశారు. ఈ దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలో దొంగ ముఖ చిత్రం స్పష్టంగా రికార్డు కూడా అయింది. ఆ తర్వాత శ్రీనివాస బుక్ స్టోర్‌లో కూడా చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. ఉదయాన్నే దుకాణాలు తీసిన వ్యాపారులు చోరీ జరిగిన విషయం గుర్తించి గగ్గోలు పెట్టారు. పోలీసులు చోరీలు జరిగిన తీరును పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

పోలీసులకు ఛాలెంజ్ విసిరేలా

పట్టణంలో అత్యంత భద్రత ఉండే ప్రాంతాలు, పోలీసు నిఘా ఉండే ప్రాంతాల్లోనే దొంగలు వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చాలెంజ్ విసురుతున్నారు. పట్టణంలో ప్రధాన రహదారులను కవర్ చేసేలా దాదాపుగా ప్రతి చోట సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటితో పాటు వ్యాపారులు, ఇళ్ల యజమానులు కూడా సొంతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. అయినా కూడా చోరీలు ఆగకపోవడం, దొంగలను గుర్తించలేకపోవడం గమనార్హం. పోలీసు నిఘా సన్నగిల్లడం, దొంగలను గుర్తించి అరెస్ట్ చేయడంలో జరుగుతున్న జాప్యం కారణంగా దొంగతనాలకు కావలి సేఫ్ ప్లేస్‌గా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎస్పీ కావలిపై ప్రత్యేక దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఉదయగిరి: మండలంలోని గండిపాళెంలో నూతనంగా నిర్మిస్తున్న అంకాళమ్మతల్లి ఆలయ నిర్మాణానికి బుధవారం గ్రామస్తులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు గణపతిపూజ, వాస్తుపూజ తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పలువురు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ జేడీ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జేడీ సుధాకర్

అల్లూరు: మండలంలోని పురిణి రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయశాఖ జేడీ సుధాకర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను, సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఏ పంటలు సాగు చేస్తున్నారో వివరాలు ఆరా తీశారు. రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్, వ్యవసాయ సహాయకులు మనోహర్ పలువురు రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అఖండ విజయం ఖాయం

• మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



ఉదయగిరి, ఆత్మకూరు నేతలతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎవరెన్ని కుయుక్తులు పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం ఖాయమని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని తన స్వగృహంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, తన రెండో సోదరుడు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆయన పెద్ద కుమారుడు అభినవ్‌రెడ్డితో కలిసి బుధవారం ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పథకాలు పసుపు కండువ వేసుకున్న వారికే దక్కేవని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో కులం, మతం, ప్రాంతం చూడకుండా అర్హతే ప్రమాణికంగా పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు కేవలం ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి తరచూ ప్రభుత్వంపై అభాండాలు వేసి దుష్ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. ప్రజలు మాత్రం వైఎస్ జగన్ పాలనకే మద్దతు పలుకుతున్నట్లు తెలిపారు. ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ ఆశయాలు, సిద్ధాంతాలను నమ్మివచ్చే వారిని పార్టీలోకి ఆహ్వానిస్తామని, పార్టీ కోసం పని చేయని వారిని పట్టించుకోబోమని స్పష్టం చేశారు. జెడ్పీ కోఆప్షన్ మెంబర్ తాజుద్దీన్, వింజమూరు సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, కలిగిరి, ఉయదగిరి మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కాటం రవీంద్రారెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, నేతలు వెంగళరెడ్డి, వీరారెడ్డి, సుబ్బారెడ్డి, పోలంరెడ్డి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అడవి పేరంటాళ్లమ్మ గుడికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని కంపసముద్రంలో అడవి పేరంటాళ్లమ్మ గుడి నిర్మాణానికి బుధవారం శాస్త్రోక్తంగా గ్రామస్తులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, గోపవరపు కాంతారెడ్డి, బోయిళ్ల రాజారెడ్డి, నారపరెడ్డి సుబ్బారెడ్డి, గ్రామానికి చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రామస్వామిపల్లిలో సచివాలయ భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు, రామస్వామిపల్లి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు బుధవారం క్షేత్ర పరిశీలన చేశారు. రూ.21 లక్షలతో నిర్మిస్తున్న రైతు భరోసా, రూ.17 లక్షలతో నిర్మిస్తున్న బల్క్‌మిల్క్ సెంటర్, రూ.12 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నాడు–నేడు పనులను పరిశీలించి మహిమలూరు పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌కి పలు సూచనలు చేశారు. రామస్వామిపల్లిలో రూ.35 లక్షలతో నిర్మిస్తున్న సచివాలయ భవనం, రూ.21 లక్షలతో నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రాలు అసంపూర్తిగా నిలిచిపోవడంపై ఎంపీడీఓ అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కార్తీక్, వీఆర్‌ఓ రమణయ్య, ఇంజినీరింగ్ సహాయకులు రఘు, ప్రసాద్ పాల్గొన్నారు.

రోటావేటర్ తగిలి బాలుడికి గాయాలు

• తండ్రిపై కేసు నమోదు

ఆత్మకూరు: ట్రాక్టర్ రోటావేటర్ తగిలి బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని బండారుపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై ఎం శివశంకర్‌రావు సమాచారం మేరకు.. బండారుపల్లికి చెందిన బొమ్మిరెడ్డి భక్తవత్సల రెడ్డి ట్రాక్టర్‌కు రోటావేటర్ ఏర్పాటు చేసుకుని పొలానికి వెళ్తున్న క్రమంలో ఆయన కుమారుడు బాలు (14) వెనుకనే ఉన్న రోటావేటర్ ఎక్కాడు. దీంతో ట్రాక్టర్ కదలడంతో దాని కింద పడడంతో కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. తొలుత ఆత్మకూరు, అనంతరం చెన్నైలోని ఆస్పత్రులకు తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. గాయపడిన బాలుడికి ఒక కాలు తొలగించినట్లు ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తి



పోలీసులకు సూచనలు చేస్తున్న న్యాయమూర్తి

ఉదయగిరి: ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా జె.అంజయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నరసరావుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నుంచి ఉదయగిరికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తిని సీఐ గిరిబాబు, ఎస్సైలు రంగనాథ్‌గౌడ్, బాజిరెడ్డి, విజయ్‌శ్రీనివాస్, కిషోర్‌బాబుతో పాటు పలువురు న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసులకు పలు సూచనలిచ్చారు. పెండింగ్ కేసులు సత్వరమే పూర్తిచేయాలని తెలిపారు.

కోళ్ల వ్యర్థాలు తరలించే వాహనం బోల్తా



ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండల పరిధిలోని గంగుంట వద్ద 67వ నంబరు జాతీయ రహదారి పక్కన కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న బొలెరో టెంపో వాహనం ప్రమాదవశాత్తు బుధవారం బోల్తాపడింది. డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు సన్మానం

ఉదయగిరి: జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైన మండలంలోని వెంగళరావునగర్ పంచాయతీ సర్పంచ్ తిరుపతి, పంచాయతీ కార్యదర్శులు గాజులపల్లి అమర్‌నాథ్‌రెడ్డి, దీనాలను ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, పలువురు పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో వెంగళరావునగర్ పంచాయతీకి అవార్డు రావడం సంతోషమని, మండలంలోని మిగతా పంచాయతీలు కూడా అవార్డుల కోసం పోటీపడి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రేణుక, ఈఓపీఆర్డీ మల్లికార్జున, జూనియర్ అసిస్టెంట్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, కరిముల్లా, వెంకటరమణయ్య, చంద్రశేఖర్, నాగూర్‌బీ పాల్గొన్నారు.